క్లుప్తంగా

నేడు మండల సమావేశం

వీరపునాయునిపల్లె : మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సురేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


భవిత కేంద్రంలో ఉన్న పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్ రమాకాంత్

కమలాపురం : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం కమలాపురం పరిశీలకుడు, దిశ డీఎస్పీ రమాకాంత్ రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలసి పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా లైటింగ్, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. వీఆర్‌ఓలు, సచివాలయ సెక్రటరీలు వెంట ఉన్నారు.

16 నుంచి వేణుగోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ట

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఉన్న నూతన వేణుగోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఈనెల 16వ తేదీనుంచి 18వ తేదీవరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 16న గణపతి పూజతో మొదలై 18వ తేదీన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కంపచెట్లు తొలగింపు


జంభాపురం- జె.కొత్తపల్లె ప్రధాన రహదారిలో ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కమలాపురం : మండల పరిధిలోని జంభాపురం నుంచి జె.కొత్తపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు జంభాపురం సర్పంచ్ ఇందిరెడ్డి శ్రీనువాసులరెడ్డి, ఎమ్మెల్యే పీఏ కిషోర్‌కుమార్‌రెడ్డిల పర్యవేక్షణలో జేసీబీ సాయంతో జంభాపురం నుంచి జె.కొత్తపల్లెకు వెళ్లే దారితో పాటు పంట పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లన్నీ తొలగించారు. ఆ దారికి ఇరువైపు కంపచెట్లు మొలచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్‌సీడీఎస్ నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరిగుట్టలో నివసిస్తున్న నంద్యాల నారాయణరెడ్డి కొన్ని రోజులుగా రెండు కిడ్నీలు దెబ్బతిని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆర్‌సీడీఎస్ సంస్థకు ఆర్థిక సాయం చేశారు. మంగళవారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆర్‌సీడీఎస్ నాయకులు బాధిత కుటుంబానికి అందించారు. అలాగే ఉన్నత విద్య కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మెరిట్ విద్యార్థులకు ఆర్‌సీడీఎస్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఆర్‌సీడీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

జమ్మలమడుగు : మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరులకు చెందిన 60 గొర్రెలు మంగళవారం తెల్లవారు జామున శెట్టిపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గొర్రెల కాపరులైన చౌడయ్య, లక్షుమన్న నాయక్, రెడ్డినాయక్‌లను బొమ్మెపల్లి సర్పంచ్ రామనాథ్‌రెడ్డితో కలిసి బాధితులను పరామర్శించి వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా వీరభద్రస్వామి మహా కుంభ నివేదన


మహా కుంభ నివేదనలో భక్తాదులు


ప్రత్యేక అలంకరణలో శ్రీవీరభద్రస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వీరభద్రుడికి మహా కుంభ నివేదనను అర్పించారు. అంతకముందు వీరభద్రస్వామి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బసవరాజు స్వామివారికి మహా కుంభ నివేదనను అర్పించి ఖడ్గ మంత్రాన్ని జపించారు. స్వామివారి ముందు అన్నం రాశిగా పోసి అందులో వివిధ రకాల కూరగాయలు, పంచామృతం, అప్పలను నైవేద్యంగా పెట్టి మహా మంగళ హారతులను పట్టారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదాన్ని పంచిపెట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చీనీ తోటను పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : వ్యవసాయ, ఉద్యాన రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని తమ పంట దిగుబడులను పెంచుకోవాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సి.రాజుపాళెంలో రైతు మేకల రాజారెడ్డి సాగు చేసిన చీని తోటను పరిశీలించారు. పంట రకం, సాగు వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. రంగాపూర్ చీనీ అంటు మొక్కలు నాటాని, మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతు చెప్పడంతో కాయ నాణ్యత కూడా బాగుందని, అలాగే ఈ పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుందన్నారు. అలాగే ఈ పంట లాభదాయంకగా ఉంటుందని రైతుకు వివరించారు. అలాగే అలహాబాద్ సఫెర రకం జామ మొక్కలని పరిశీలించారు. ప్రస్తుతం జామ ధర ఆశాజనకంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పథకాలను సద్వినియోగం చేసుకుని తమ పంట సాగును, అలాగే దిగుబడులను పెంచుకోవాలన్నారు. జిల్లాలో ముఖ్యంగా బత్తాయి, అరటి, మామిడి, పసుపు, టమోట, పూలసాగు 1,44,130 ఎకరాల్లో సాగు చేశారన్నారు. కొత్తగా ఈ ఏడాది పండ్ల తోట విస్తీర్ణ పథకం కింద అదనంగా ఇప్పటి వరకు 650 ఎకరాలకు సబ్సిడీ మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద అర్హులైన రైతులకు ట్రాక్టర్లు, థైవాన్ స్ప్రేయర్లు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఉద్యాన జిల్లా అధికారి మైఖేల్ రాజీవ్, ఏడీఏ నరసింహారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ సింధూరి, హెచ్ఏ సుప్రియ రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

సింహాద్రిపురం : ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు పూర్తిగా రుణ మాఫీ చేశారు. అందులో భాగంగా వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు సింహాద్రిపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించనున్నారు. ఈ సంబరాలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు హాజరై డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేయనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మార్కెట్ యార్డులో సభా స్థలాన్ని చదును చేసి ఏర్పాట్లను పూర్తి చేశామని.. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో ఈనెల 15వ తేదీన గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రాష్ట్ర డైరెక్టర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మహిళా కార్యకర్తలు, మహిళా సంఘాలు, యువజన విభాగాల వారు, మిగతా అనుబంధ సంఘాల వారందరూ హాజరు కావాలన్నారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు


మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న విద్యా వలంటీర్లు, తదితరులు

వేంపల్లె / చక్రాయపేట : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటి పెంచాలని ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్-3 అధికారి డాక్టర్ జి.విశ్వనాథరెడ్డి సూచించారు. చక్రాయపేట మండలం చెరుకాంపల్లె గ్రామంలో కొన్ని రోజులుగా వివిధ అంశాల మీద విద్యా వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం గ్రామంలో మొక్కలు నాటడంవల్ల అవి పెరిగి చెట్లుగా ఏర్పడి మానవాళి మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతుందని.. మొక్కల పెంపకం ద్వారా వాతావరణ కాలుష్యం నివారించవచ్చునని.. మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తమ పరిసరాలలో పరిశుభ్రత పాటించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనం పెంపొందించాలని.. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యా వలంటీర్లు కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ మంగళవారం పరిశీలించారు. కలమల్ల, సున్నపురాళ్లపల్లె, చిలంకూరు ఐసీఎల్ చిన్నదండ్లూరు, మాలెపాడు, ఇల్లూరు గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి అక్కడున్న అధికారులతో మాట్లాడారు.

జాబితా నుంచి 14,779 మంది ఓటర్ల తొలగింపు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జనవరి 9వ తేదీ వరకు నిర్వహించిన సర్వేలో మొత్తం 14,779 మంది ఓటర్లను తొలగించి, 10,249 మంది నూతన ఓటర్లను జాబితాలో చేర్చినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు చేసిన ఫిర్యాదుల మేరకు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పరిశీలించి ఓటర్ల జాబితాను ప్రకటించామన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 2,40,835 మంది ఉండగా అందులో పురుషులు 1,17,067 మంది, స్త్రీలు 1,23,751 మంది 17 మంది జండర్లుగా ఉన్నట్లు తెలిపారు. జనవరి 23వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఫారం 6 కింద 94 మంది, ఫారం-7 కింద 787 మంది, ఫారం-8 కింద 1306 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,40,835 మంది ఓటర్లు ఉండగా అందులో 18-19 సంవత్సరాల వయసు ఉన్నవారు 5942 మంది, 20-29 వయస్సు మధ్య ఉన్నవారు 47,402, 30-39 మధ్య 64,832, 40-49 మధ్య 49,879 మంది, 50-59 మధ్య 37,102, 60-69 మధ్య 22,636, 70-79 మధ్య 10,744, 80 సంవత్సరాల పైబడి 2,726 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ షఫీ, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌ను మంగళవారం రాత్రి డీఎస్పీ యశ్వంత్ తనిఖీ చేశారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి స్టేషన్‌కు తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌లు పాల్గొన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

స్థానిక పోలీసులు మంగళవారం ఉప్పలూరు గ్రామానికి చెందిన నాగన్న అనే వ్యక్తినుంచి 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.


ఎయిర్ కండిషనర్ టెక్నిషియన్ కోర్సుపై ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, సీడాప్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా ఎయిర్ కండిషనర్ టెక్నిషియన్ కోర్సుపై ఉచితంగా 90 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారని న్యాక్ ఇన్‌చార్జి యు.చెన్నకేశ్వర్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ శిక్షణకు ఆసక్తిగల యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని.. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, శిక్షణకు కావాల్సిన స్టేషనరీ, షూ, యూనిఫాం ఉచితంగా ఇస్తారన్నారు. ఈ శిక్షణకు ఆసక్తిగల 18 ఏళ్ల నుంచి 34 ఏళ్ల వయస్సు గల ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, డిగ్రీ, పీజీ చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల యువత తమ వెంట ఉపాధి హామీ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సర్టిఫికెట్లు, నాలుగు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో న్యాక్ శిక్షణ కేంద్రానికి హాజరుకావాలన్నారు. వివరాలకు 9985142155, 9989140993 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు : పట్టణంలోని 18వ వార్డులో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వార్డు కౌన్సిలర్ గౌరీనాథ్‌రావు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న టిడ్కో ఇళ్లు

ఎర్రగుంట్ల : పట్టణంలో నిర్మించిన 1584 టిడ్కో ఇళ్లకు సంబంధించిన పట్టాలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి మున్సిపల్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలతో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి టీడీపీ నేత చంద్రబాబునాయుడు బ్యాంక్ రుణాలు ఇప్పించి వాటితో టిడ్కో ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పి వాటి నిర్మాణ పనులను మధ్యలోనే ఆపివేశారు. చంద్రబాబు మోసాలను గమనించిన ప్రజలు బాబును గద్దిదించారు. తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మధ్యలో ఆగిపోయిన టిడ్కో ఇళ్లకు నిధులు మంజూరు చేసి వాటిని పూర్తి చేసి లబ్ధిదారుల పేరు మీద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి వారికి పత్రాలను అందించనున్నారు.

నేడు కార్మికుల వివరాల నమోదుకు ప్రత్యేక క్యాంపు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికుల వివరాల నమోదుకు ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత పొందేందుకు నమస్తే పథకంలో భాగంగా కార్మికుల వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టమ్(నమస్తే) పథకం ద్వారా కార్మికుల జీవన భద్రతతోపాటు ఉపాధి కల్పన ఈ పథక యొక్క ఉద్దేశ్యమన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు కాబడిన కార్మికులకు రెట్టింపు వైద్య సహాయం, కార్మికుల పిల్లల చదువులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కాలర్ షిప్‌లు పొందవచ్చునని తెలిపారు.

వైవీయూలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని పాత ఆర్ట్స్ బ్లాక్‌లో నూతన ఆర్‌ఓ ప్లాంట్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్.. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్తులో తాగునీరు నిత్యం అందరికీ అందుబాటులో ఉండేలా శుద్ధ జలప్లాంటును ప్రారంభించామన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలోని 9 ఆర్‌ఓ ప్లాంట్‌లు ఉన్నాయని ఇది పదవది అన్నారు. దీని ఏర్పాటుకు జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) రూ.1.20 లక్షల ఆర్థిక సహకారం అందించిందన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి


దివ్యాంగుడికి అందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని.. అలాగే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వెంకటాపురం సచివాలయ పరిధిలో ఎర్రగుడిపల్లె, వెంకటాపురం, బీసీ కాలనీలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లను అందిస్తూ సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందారో ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని.. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని.. మరింత ఆర్థికాభివృద్ధి సాధించేందుకు మరిన్ని పథకాలను ప్రవేశపెడతారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి, కౌన్సిలర్లు పురుషోత్తం, విజయ్ నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్, సూరి, కృష్ణమూర్తి, డేనియల్ బాబు, నాగరాజు, సంపత్, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎం హెచ్‌వో నాగరాజు

వల్లూరు : ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడానికి చర్యలు చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని లేబాక గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందుబాటులో వున్న వైద్య సేవలను గురించి ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు అందిస్తున్న వైద్య సేవలను ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందన్నారు. దీని ద్వారా పెద్ద పెద్ద జబ్బులకు సైతం కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందడానికి అవకాశం కలిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వైద్య సేవలను అందిస్తారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా నెల నెలా క్రమం తప్పకుండా గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్ ఏర్పాటుతో వైద్యం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. బీపీ, షుగర్, అంటు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంటమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ రమేష్, డీపీవో వెంకటరమణ, ఎంపీడీవో విజయభాస్కర్, వైద్యాధికారులు ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్నే సీఎం కావాలి


ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో అమలు కావడం లేదని, ఈ పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్ననే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మంగళవారం 3వ కౌన్సిల్ వార్డులో ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని వారు ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజలకు ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో తప్పని సరిగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా రవీంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని సీఎంగా జగనన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, ఇర్ఫాన్, శ్రీనివాసరెడ్డి, గఫార్, జావీద్, చంద్ర ఓబుళరెడ్డి, మోనార్క్, నగేష్, దస్తగిరి, కరీం, శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో సాంకేతికతను వినియోగించుకోవాలి

వైవీయూ : విద్యార్థులకు సరళంగా అర్థమయ్యేలా బోధించడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో వర్చువల్ విధానంలో 'న్యాక్ గుర్తింపులో కొత్త సంస్కరణలు' అన్న అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గుర్తింపు విధానాలపై ఏర్పాటైన రాధాకృష్ణన్ కమిటీ వివిధ రంగాల నిపుణుల అభిప్రాయాలను తీసుకుని ప్రస్తుతం ఉన్న విధానంలోని లోపాలను సరిచేసేలా, నూతన గుర్తింపు విధానాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. మరో వక్త డా. ఎం. జయలక్ష్మికృష్ణ కోయల్ సంస్కరణల గురించి వివరించారు. ఆచార్య సౌదామిని మీనన్, డా. సి.వి.కృష్ణవేణి మాట్లాడుతూ కొత్త సంస్కరణలో భాగంగా తీసుకోవాల్సిన మార్పుల గురించి ఉపన్యసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. పి. శచీదేవి, విస్నీతేజ, డా. శాలిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుమంగళి పూజ


సుమంగళి పూజల్లో పాల్గొన్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం సుమంగళిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి సహస్ర దీపాలంకరణ, విశేష అలంకారం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 108 మంది ముత్తయిదువలతో సుమంగళి పూజ నిర్వహించారు. తర్వాత దశ హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో ఆలయ నిర్వాహకులు అమ్మవారి పూజలో ఉంచిన పసుపు, కుంకుమ, గాజులు, గంధం, పూలను కార్యక్రమానికి హాజరైన ముత్తయిదువులకు అమ్మవారి ప్రసాదంగా అందజేశారు. ఆలయ ఈఓ ఏ. శ్రీధర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.